# మనసుకో మరో మనసు


కేశిరాజు ఫణిప్రసాద్


సాయంకాలం! మా ఊరి ఏటిగట్టున కూర్చుని ఉన్నాం!

"ఒరేయ్ విశ్వం ఈ ఏటిగట్టుకి మనకి మధ్య ఎంతో అనుబంధం ఉందిరా. ఏమంటావు?"

ఇలా అనటం వాడికి, వినటం నాకూ అలవాటే! అందువల్లే మాట్లాడకుండా తలూపాను!

కశ్యప, నేను చిన్నప్పటినుంచి ఈ ఊళ్ళోనే కలిసి చదువుకున్నాం! నేను, కశ్యప మరికొంత మంది స్నేహితులు చదువుకునే రోజుల్లో ప్రతిరోజూ ఈ ఏటిగట్టున ఎన్నెన్నో ఆటలాడి, ఏటిలో ఈతకొడుతూ ఉండేవాళ్లం!






ఏటిలోని అలలు ఏరు విడిచి పోలేనట్టే, చిన్నప్పటి జ్ఞాపకాలు కూడా ఏటి గట్టునే అంటిపెట్టుకునే ఉన్నాయి! గాలికి కదిలే అలల చప్పుడులో ఇప్పటికీ చిన్ననాటి మా కబుర్లు, కేరింతలూ మాకు వినిపిస్తూనే ఉంటాయి.

నా చదువు పూర్తయ్యాక నేను పట్నం వెళ్లి కాలేజీలో చేరాను! మా కశ్యప ఈ ఊళ్ళోనే ఉండిపోయి వ్యవసాయంలో స్థిరపడ్డాడు. తీరికున్నప్పుడల్లా ఈ ఊరొచ్చి కశ్యపతో గడుపుతూంటాను. ప్రస్తుతం ఈ ఊరొచ్చి రెండు రోజులు అయింది. నాకు కుటుంబ సమస్య రావడంతో కశ్యపతో చెప్పి పరిష్కారం చూపమని అర్థించాను.

"సర్లేరా, ఆలోచిద్దాం! కొన్నాళ్ళు ప్రశాంతంగా ఇక్కడే ఉండు".

"హలో మిత్రమా, మాట పలుకు మానేసి అంత ఆలోచిస్తున్నావేమిరా" అని అడిగిన కశ్యపని చూస్తూ ఉండిపోయాను. జవాబు చెప్పలేదు.

"సమస్యలకి పరిష్కారం వెతుక్కోవడం, కష్టాలొచ్చినప్పుడు తట్టుకుని సుఖాలని మన సొంతం చేసుకోవాలి. అదేరా నిజమైన జీవితం".

వీడెప్పుడూ ఇంతే. ఏ విషయాన్నీ మనసుకి పట్టించుకోడు. కశ్యప స్వభావం తెలిసినవాడినే! ఇప్పుడు కూడా అలాగే ప్రవర్తిస్తున్నందుకు ఆ క్షణంలో కోపమొచ్చింది.

ఏటిలోని ప్రవాహాన్ని చూస్తూ ఉండిపోయాను.

"విశ్వనాథ కొడుకు చదువు మీద శ్రద్ధ చూపించడంలేదు. తల్లిదండ్రులను ఎదిరిస్తున్నాడు. ఎవరి మాట వినకుండా మొండిగా ప్రవర్తిస్తున్నాడు. అందరూ తలోరకంగా మాట్లాడుకుంటున్నారని మనసు చిన్నబుచ్చుకుంటున్నాడు".

హఠాత్తుగా కశ్యప మాటల్లో నా మనసులో మెదులుతున్న ఆలోచన!

'హమ్మయ్య ఇప్పటికైనా వీడు అసలు విషయానికొచ్చాడు' అనుకుంటూ వాడివేపు చూశాను.

"అసలు సంగతి..." కశ్యప నన్ను మాట్లాడనివ్వలేదు.

"ఒద్దు. కాస్సేపు నేను మాట్లాడతాను!" అలాగేనని తలూపాను.

"నీ కొడుకు ఎందుకు చదువుకోవాలి? చదువు మీవాడికి అత్యవసరమా?"

కశ్యప అలా అడుగుతాడని ఊహించలేదు.

"చదువుకోకపోతే వాడికి బ్రతుకెలా గడుస్తుంది?" నేనన్న మాటకు కశ్యప ఎంతమాత్రం ఒప్పుకోలేదు.

"అంటే బ్రతకటంకోసం చదివిస్తున్నావా? చదువుకోనివాడికి జీవితం గడవదని నువ్వెందుకనుకుంటున్నావో నీకు అర్థం కావడంలేదు. నీ మనసులో మాట సూటిగా చెప్పు! నువ్వు నీ కొడుకుని ఎందుకు చదివిస్తున్నావు? వాడి చదువుకి అర్థమేమిటి?" ఖచ్చితంగా అడుగుతున్నాడు కశ్యప.

అనాలోచితమైపోతోంది మనసు! జవాబు చెప్పడమెలా?

జీవితానికీ చదువుకూ ఏమైనా సంబంధం ఉందా? చీకటిపడ్డాక ఇద్దరం కలిసి ఇంటికొచ్చాం! భోజనాలు అయ్యాయి. అసలే పల్లెటూరేమో సగం నిద్రలో ఉంది!

కశ్యప, నేను ఆరుబయట మంచాలు వేసుకుని పడుకున్నాం. వాడు అడిగిన ప్రశ్న మనసును తికమకపెడుతోంది! ఒకటే ఆలోచన. నిద్రకు దూరమైన కనురెప్పల మీద కశ్యప మాటలు తిష్టవేసుకుని కూర్చున్నాయి! అటూ ఇటూ దొర్లుతున్నాను.

నాకొచ్చిన కష్టం చెప్పుకుని ఏదైనా మాట సాయం చెయ్యమంటే స్నేహితుడిగా వీడు చేస్తున్న నిర్వాకం ఇలా తగలడింది. చికాకు పడుతోంది మనసు.

ఇంతకీ కశ్యప ప్రశ్నకు అర్థమేమిటో? మళ్ళీ అదే ఆలోచన!

"నా కొడుకు గురించి నేను పడుతున్న బాధ కశ్యపకి తన కొడుకు విషయంలో కలగలేదా?" అనుమానం రాగానే మంచం మీద పడుకున్న కశ్యపని ఒక్కసారి పరిశీలనగా చూశాను.

గుండెల మీద చెయ్యి వేసుకుని హాయిగా నిద్రపోతున్నాడు. నిశ్చింతగా నిద్రపోతున్నాడు! అదృష్టవంతుడు! అప్రయత్నంగా అనుకున్నాను.

'అయితే మాత్రం నా పరిస్థితి అర్థం చేసుకోడేమిటి? అవసరం లేదా? నేను దురదృష్టవంతుడినా?' అనుకోకుండా వచ్చిన ఆలోచనతో మనసు కలుక్కుమంది.

కశ్యప పెద్దగా చదువుకోకపోయినా, కొడుకుని పట్నంలో ఉంచి మరీ చదివించాడు. కొడుకు చదువు విషయంలో డబ్బుకోసం ఎప్పుడూ వెనకాడలేదు. పైగా ఒక్కడే కొడుకు! ఎంత గారాబంగానో పెంచాడు. కానీ చదువు విషయంలో ఎంతో ఖచ్చితంగా ప్రవర్తించేవాడు.

అడిగినవన్నీ కాదనకుండా ఇచ్చేవాడు! ఏదైనా చదువు తరువాతే! ఒక తండ్రి కొడుకుని ఎటువంటి క్రమశిక్షణతో పెంచాలో కశ్యపని చూసి నేర్చుకోవాలి అనుకోవటం కూడా నేను విన్నాను!

"ఏరా విశ్వం నిద్రపట్టడం లేదా?" అన్నమాట వినపడి ఉలిక్కిపడ్డాను. మంచం పక్కనే ఉన్న మరచెంబులోని మంచినీళ్ళు తాగుతూ అడిగాడు కశ్యప.

'నువ్వన్న మాటలు మనసులో ముళ్ళలా గుచ్చుకుంటుంటే నిద్రపోలేకపోతున్నాను' అని లోలోపల అనుకుంటూ "అటువంటిదేమీ లేదురా. ఇప్పుడిప్పుడే కునుకు పడుతోంది" పైకి మామూలుగా మాట్లాడాను.

నా మాట విని మళ్ళీ మామూలుగా మరోవైపుకి ఒత్తిగిలి పడుకున్నాడు. 'నీకేంరా, ఇక్కడ హాయిగా వ్యవసాయం చేసుకుంటున్నావు. అక్కడ నీ సుపుత్రుడు మంచి ఉద్యోగం చేసుకుంటున్నాడు' – కశ్యప ప్రస్తుత పరిస్థితిని తలుచుకోగానే నాలో కలుగుతున్న ఈర్ష్య.

"అది చాలా తప్పు! నీ నేస్తం ఆనందంగా ఉండటం చూసి నువ్వు కూడా సంతోషించాలి" చటుక్కున వివేకం హెచ్చరించింది.

ఈరోజు పైకి చెప్పటం లేదుగాని కొడుకు చదువు గురించి ఎంత శ్రమించాడో నేనూ చూశాను.

కశ్యప గత జీవితం జ్ఞాపకం మనసులో కదులుతోంది!

గాఢంగా నిద్రపోతున్నాను! హఠాత్తుగా మెలకువొచ్చింది.

మంచం మీద పడుకునే అటూ ఇటూ చూశాను. ఇంకా పూర్తిగా వెలుగు రాలేదు. గడియారం వైపు చూశాను. నాలుగు గంటలు!

కశ్యప ఇంటి వరండాలో లైటు వెలుగుతుంది! వెంటనే లేచి వీధి గుమ్మంలోకి వచ్చి చూశాను. కశ్యప కొడుకు పాఠం గట్టిగా చదువుతున్నాడు. అప్పుడు అర్థమైంది నాకు ఎందుకు మెలకువొచ్చిందో! కొడుకుని దగ్గరుండి చదివిస్తున్నాడు.

"ఒరేయ్ నిలబడి చదువు. కూర్చుని చదివితే కునికిపాట్లొస్తాయి"

తండ్రి మాటకు వాడు నిలబడి చదవడం మొదలెట్టాడు.

అనుకోని సన్నివేశం! ఆశ్చర్యంతో చూస్తున్నాను!

నాకు తెలిసి ప్రతిరోజూ కశ్యప పూర్తిగా పొద్దెక్కితే గాని నిద్రలేవడు. చదువుకునే రోజుల్లో కూడా వాడిని పొద్దుటే లేపటానికి ఎన్నోసార్లు పిలిచేవాడు. ఆయన అరుపులకి ఇరుగుపొరుగుల వాళ్ళందరూ లేచేవారు. కశ్యప మాత్రం కప్పుకున్న దుప్పటి కూడా తీసేవాడు కాదు! పెద్దవాడయినా ఆలస్యంగానే నిద్రలేచేవాడు.

ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. మంచం మీద పడుకున్నాను, మరికాస్సేపు నిద్రపోవాలని! క్రితంరోజు రాత్రి పట్నం నుంచి వచ్చాను. శనివారాలు మా ఊరొచ్చి మళ్ళీ సోమవారం ఆఫీసు టైముకి పట్నం వెళ్ళటం అలవాటు!

ఎంత ప్రయత్నించినా మళ్ళీ నిద్రపట్టడం లేదు!

ఆరు గంటలకి లేచి అలవాటు ప్రకారం కాలినడకన ఊరి చివరకు బయలుదేరాను! చల్లగా తగులుతున్న గాలికి మనసు హాయిగా ఉంది.

పొలంలో కలిశాడు కశ్యప. "ఎప్పుడొచ్చావురా" నన్ను చూసి ఎంతో ఆశ్చర్యపోతూ అడిగాడు.

"రాత్రి పది గంటలకి. మీ ఇంట్లో అందరూ అప్పటికే పడుకున్నారు" నా మాటకు అవునని తలూపాడు.

"అవునురా విశ్వం! మా అబ్బాయిని దగ్గరుండి చదివించటానికి తెల్లవారుజామున లేస్తున్నాను. అందుకే పెందరాళే పడుకోవటం అలవాటు చేసుకున్నాను."

కశ్యప ఎంత మామూలుగా చెప్పినా వాడిలో చెప్పుకోదగిన మార్పు వచ్చిందని అర్థం చేసుకున్నాను!

కొడుకు భవిష్యత్తుకోసం వర్తమాన జీవితాన్ని మార్చుకున్న తండ్రి! ఆరోజు సాయంకాలం కశ్యప, నేను కబుర్లు చెప్పుకుంటున్నాం. "ఒరేయ్ కశ్యప నీ కొడుకు చదువుతోపాటు వాడి ఆరోగ్యం విషయం మర్చిపోకు, పిల్లలకి కంటినిండా నిద్ర ఉండాలి" మాటల మధ్యలో అన్నాను.

"అందుకేరా పెందలాడే పడుకోవటం! తెల్లవారుఝామునే లేచి చదువుకుంటే జ్ఞాపకశక్తి పదునుగా ఉంటుంది! బ్రాహ్మీ ముహూర్తకాలం శరీరానికి, మనసుకి ఆరోగ్యం పెంచుతుంది".

కశ్యప మాటల్లో సమయస్ఫూర్తి! అంతేకాదు – తోటివాళ్ళకి కూడా ఆ మాటల వల్ల స్ఫూర్తి! మనస్ఫూర్తిగా అభినందించాను.

కాలానుగుణంగా కశ్యప ఎంతో క్రమశిక్షణతో ఉంటూ తన కొడుకుని కూడా ఎంతో చక్కగా తీర్చిదిద్దుతున్నాడు.

వారంవారం పట్నం నుంచి రావటం, మళ్ళీ వెళ్ళటం వాడు మాత్రం తప్పడంలేదు! నా మనసు కూడా మార్పుకోసం తహతహలాడుతూనే వుంది.

"నాన్నా, కశ్యప గారి అబ్బాయికి అన్నింటిలోనూ ఫస్ట్ మార్కులొస్తున్నాయి. ఆయనలాగే నువ్వు కూడా నాకు చదువు చెప్పొచ్చుగా" ఒకరోజు హఠాత్తుగా మా అబ్బాయి అడిగాడు!

"దానికేముంది అలాగేరా" అందామనుకున్నాను! కాని అనలేకపోయాను.

నా జీవితానికి లక్ష్యం ఉందా? అర్థముంటూ ఉందా?

మా నానిగాడి మాటలు అనుక్షణం నా ఉనికిని నిలదీస్తున్నాయి.

"మా నాన్న నన్ను పట్టించుకోవడం లేదు" అని వాడు బాధపడితే? ఒక్కసారిగా నా గుండె పట్టేసినట్టయింది! ఊహించటానికే భయమేస్తోంది!

పల్లెటూరి నుంచి కుటుంబంతో పట్నం వచ్చి స్థిరపడ్డాను!

పగలంతా ఆఫీసులో పని చెయ్యటం, సాయంత్రం వీలయినంత తొందరగా ఇంటికొచ్చి మావాడికి చదువు చెప్పడం! ఇలా చెయ్యటం వల్ల మనసు కాస్త కుదుటపడింది!



## విటమిన్ ఇతో జరభద్రం

వివిధ ఆరోగ్య సమస్యలకు తీసుకునే విటమిన్ ఇ సప్లిమెంట్ల కారణంగా గుండెజబ్బులు వచ్చే ప్రమాదం పొంచి వుందని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. విటమిన్ ఇ సప్లిమెంట్స్‌ను ఎక్కువ మోతాదులో వాడినట్టయితే గుండెజబ్బులు కానీ క్యాన్సర్ లాంటి భయంకరమైన వ్యాధులు రావచ్చని వారు అంటున్నారు. అయితే వీటిని చాలా తక్కువ మోతాదులో తీసుకోవడం వలన కొన్ని రకాల క్యాన్సర్ల నుంచి కూడా తప్పించుకోవచ్చని వారు సూచిస్తున్నారు. వైద్యుని సలహా లేకుండా ఎట్టి పరిస్థితుల్లోనూ వీటిని వాడకూడదని వీరు చెపుతున్నారు.

దైనందిన జీవితంలో తీరిక కరువైపోతోంది! మరేం ఫరవాలేదు! ఎందుకంటే నా కుటుంబ శ్రేయస్సు నాకు ముఖ్యం! ఆదివారాలు, సెలవు రోజుల్లోనూ ఇంట్లోనే వుంటున్నాను.

ఈమధ్యకాలంలో పల్లెటూరికి వెళ్ళలేదు! కాదు వెళ్ళాలనిపించలేదు!

ఆరోజు పొద్దుటే మా అబ్బాయిని స్కూలులో దింపి ఇంటికొచ్చాను. మళ్ళీ నేను ఆఫీసుకెళ్ళిపోవాలి! హడావుడిగా తయారవుతున్నాను.

"విశ్వనాథ్ గారి ఇల్లు ఇదేనా?" ఎవరో నా గురించి అడగడం వినిపించింది. వెంటనే వీధి గుమ్మంలోకి వెళ్ళాను. ఇంటి ముందు కశ్యప నిలబడి ఉన్నాడు.

ఎంతో సంతోషంతో వెళ్ళి వాడిని లోపలికి తీసుకు వచ్చి కూర్చోబెట్టాను.

"ఎన్నాళ్ళయిందిరా విశ్వం మనం కలిసి" ఆత్మీయంగా అడిగేసరికి మాట్లాడడం చేతకాక కశ్యపనే చూస్తూ ఉండిపోయాను.

"బావున్నారా అన్నయ్యగారూ" అంటూ మా ఆవిడ లోపలినుంచి వచ్చింది.

మా ఆవిడిచ్చిన మంచినీళ్లు తాగుతూ "బాగానే ఉన్నాం" అని జవాబు చెప్పాడు.

"విశ్వం మీకు ఒక శుభవార్త చెప్పాలని నిన్ను వెతుక్కుంటూ మీ ఇంటికి నేనే వచ్చాను. ముందు ఈ స్వీట్లు తీసుకో" పల్లెటూరికి నేను రావడం లేదనే నిష్ఠూరం వ్యక్తం చేశాడు.

"అన్నయ్యగారూ శుభవార్తంటున్నారు.." మా అర్థాంగి మాట కలిపింది.

"అదే మావాడు టెన్త్‌క్లాసు స్కూలు ఫస్టొచ్చాడు. ఇవ్వాళే వాడిని ఈ ఊళ్ళోనే కాలేజీలో చేర్పించి వస్తున్నాను" కశ్యప మాటలు వినగానే ఎంతో ఆనందంతో అభినందించాను.

"మరో విశేషం. స్కూలు ఫస్టొచ్చిన మావాడిని, నన్ను మన ఊరి స్కూలు హెడ్‌మాస్టారు మనింటికొచ్చి మరీ అభినందించారు" కశ్యప మాటలు వినగానే సంతోషంగా వాడిని కౌగిలించుకున్నాను.

"మా అబ్బాయి ఫోటో పేపరులో కూడా వేశారు" జేబులోంచి పేపర్ తీసి చూపించాడు.

"ఎంతో మంచివార్త చెప్పారన్నయ్యగారూ" అంటూ మా అర్థాంగి, నాకు కశ్యపకి కాఫీ ఇచ్చింది.

"ఒరేయ్ మనవాడు స్కూలుకే కాదురా మన ఊరికే మంచి పేరు తీసుకొచ్చాడు" ఉత్సాహాన్ని పట్టలేకపోతున్నాను!

పుత్రోత్సాహంతో కశ్యప మొహం వెలిగిపోతోంది! నిజంగా కశ్యప ఎంతో అదృష్టవంతుడు – మనస్ఫూర్తిగా అనుకున్నాను.

'పిల్లలు కష్టపడి సాధించే విజయాలు తల్లిదండ్రులను మరచిపోలేని అనుభూతులతో స్పృశిస్తాయి. అంతేకాదు అవన్నీ తియ్యటి జ్ఞాపకాలు'.

ఆ క్షణంలో నాలో కలిగిన స్పందన! అదే క్షణంలో అంతరంగంలో ఏదో కదలిక!

"విశ్వనాథ గారూ మీ అబ్బాయి సరిగ్గా చదవడం లేదు"

మా నాని క్లాస్ టీచర్ ప్రోగ్రెస్ రిపోర్టు నాకిస్తూ అన్నమాట.

"క్లాసులో మిగతా పిల్లలు వాళ్ళ పేరెంట్స్ సంతకాలు పెట్టించి తిరిగి మాకిచ్చారు. మరి మీ అబ్బాయి?" మరో టీచర్ మావాడి ప్రవర్తన ఎలా ఉందో చెప్పింది.

కశ్యప కొడుకుని తలుచుకున్నప్పుడల్లా వాడి ఉత్సాహానికి హద్దులు లేవు. మరి నేను మావాడి గురించి ఆలోచించినప్పుడల్లా నాలో రెట్టింపవుతున్న ఆందోళన! ఎందుకు? ఎందుకిలా జరుగుతోంది? ఎక్కడో లోపం ఉంది. అదే అర్థం కావడం లేదు.

ఆరోజు మధ్యాహ్నం సెలవుపెట్టి మరీ ఇంటికొచ్చాను. ఎందుకంటే మా అబ్బాయితో మాట్లాడితే గాని జరుగుతున్నదేమిటో తెలియదు.

సాయంత్రం నాలుగు గంటలకు ఇంటికొచ్చాడు మా నాని!

కాళ్లు, చేతులు కడుక్కుని బట్టలు మార్చుకున్నాడు. తరువాత మా ఆవిడ పెట్టిన టిఫిన్ తిన్నాడు. కాసేపటికి క్రికెట్ బేట్ తీసుకుని బయలుదేరాడు.

''ఒరే నానీ, నీతో మాట్లాడాలి ఇలా వచ్చి కూర్చో'' నా మాట విని, గుమ్మంలోనే నిలబడి ''ఏడు గంటలకు చదువుకోవడానికి వస్తాను కదా నాన్నా, అప్పుడు మాట్లాడులే'' అన్నాడు. ఆ జవాబుకు నాకు చాలా కోపం వచ్చింది.

''నువ్విప్పుడు బయటకెళ్లడానికి వీల్లేదు. చెప్పిన మాట విని లోపలికిరా'' ఖచ్చితంగా చెప్పాను.

''పొద్దునే అయిదు గంటలనుంచి ఇంట్లో చదువు! మళ్లీ సాయంకాలం వరకు స్కూల్లో చదువు! రాత్రి ఏడు గంటలనుంచి మళ్లీ చదువు! చదువుకోవడం తప్ప నాకంటూ ఆటమాటలు ఉండకూడదా?''

నానిగాడు మాట్లాడిన తీరుకు నాలో ఆశ్చర్యం! వెంటనే బలవంతంగా అణచుకున్నాను.

''నువ్వు వెలగబెడుతున్న చదువు ఎంత గొప్పగా ఉందో నీతో చెపుదామనే నిన్ను ఉండమంటున్నది'' అంటూ వస్తున్న కోపం నిగ్రహించుకుంటున్నాను.

''ఏమిటండీ మీరు? నానిగాడు చెప్పిన మాటల్లో తప్పేముంది. వాడి చదువు కురించి మీకసలు అనుమానమెందుకొచ్చింది'' మా ఆవిడ కల్పించుకుంది.

''ఇదిగో మన సుపుత్రుడి ప్రోగ్రెస్ రిపోర్టు. దీని మీద మనిద్దరి దగ్గర సంతకం పెట్టించుకునే తీరుబడి కూడా లేకుండా చదువుకుంటున్నాడా'' ప్రోగ్రెస్ కార్డు మా ఆవిడకిచ్చాను.

చూశాక ''ఇదేమిటిరా ఇంతవరకూ మాకెవ్వరికీ చూపించలేదు. పైగా ఈ మార్కులేమిటి?'' కొడుకు వైపు అయోమయంగా చూస్తూ అడిగింది.

ఏం చెపుతాడోనని ఇద్దరం వాడినే చూస్తున్నాం. నిర్లక్ష్యంగా తల విదిలించాడు!

''ఎప్పుడూ చదువు చదువు అనే సాధింపుకి నేను తట్టుకోలేకపోతున్నాను. స్కూలుకి వెళ్లి నా క్లాసులో కూర్చోవాలంటే విసుగొస్తుంది'' కొడుకు చెప్పిన జవాబు వినగానే తల్లిదండ్రులుగా మాకు మాట్లాడలేని పరిస్థితి. ఎలా మాట్లాడాలో తోచడంలేదు.

''అవునండీ! రోజస్తమానం చదువంటే వాడు మాత్రం ఎలా భరించగలడు?'' అర్ధాంగి మాటల్లో సానుభూతి.

''అందుకని వాడు క్లాసులు ఎగ్గొడుతుంటే ఊరుకోవాలా?''

పైకి కోపంగా మాట్లాడుతున్నా నాలో కూడా వాడి మాటలకు జవాబు లేదు!

ఈ ఏడాది సెవెన్త్‌క్లాస్ పబ్లిక్ పరీక్షలు! మెరిట్‌లో పాసవ్వాలి, కాని వాడి స్వభావం అందుకు అనుకూలించడం లేదు! చెయ్యి చేసుకుందామంటే సంస్కారం ఒప్పుకోవడం లేదు. పోనీ గట్టిగా మందలిస్తే - చిన్నబుచ్చుకుని ఎటువంటి అఘాయిత్యమైనా చేస్తే?

మరి ఎలా? వీడి ప్రవర్తనలో మార్పు వచ్చి తీరాలి! తండ్రిగా నాలో తాపత్రయం!

నిత్యజీవితంలో హితవు కోరేది స్నేహం! కశ్యపకు మా కుటుంబ శ్రేయస్సు ముఖ్యం! వాడితో మాట్లాడాలి! అనుకున్న మరుక్షణం సెలవుపెట్టి కశ్యప దగ్గర కొచ్చాను.

ఆలోచనలతో సతమతమవుతున్న నేను ఎప్పుడు నిద్రపోయానో కూడా తెలియదు! మర్నాడు ఆలస్యంగా నిద్రలేచాను! కాఫీ తాగి వెంటనే స్నానం చేసి పూజ ముగించుకున్నాను! కశ్యప పొలం వెళ్ళినట్టున్నాడు!

కాలక్షేపంకోసం పేపరు చదువుతున్నాను! మనసు కశ్యపకోసం ఎదురుచూస్తోంది.

మధ్యాహ్నం పనులు పూర్తిచేసుకుని ఇంటికొచ్చాడు! నేను భోజనం చెయ్యలేదని తెలుసుకుని, వెంటనే స్నానంచేసి వచ్చాడు. కలిసి భోజనం చేశాం.

ఇంటి ఆవరణలో వున్న మామిడి చెట్టుకింద అరుగు మీద కూర్చున్నాం.

''నువ్వు ఎందుకొచ్చావో తెలుసు! నీ మనసుని తొలిచేస్తున్న ఆలోచనలూ నేను అర్థం చేసుకున్నాను! అయినా నీతో మాట్లాడకుండా కాలక్షేపం చేస్తున్నాను!''

నా మనసుని చదివి ఔపోసనపట్టినట్టుగా హఠాత్తుగా మాట్లాడిన కశ్యప తెలివితేటలకు విస్తుపోయాను.

''విశ్వం ఈమధ్యకాలంలో నువ్వు మన ఊరు రాలేదు. జరిగిన సంగతులు నీకు తెలియవు. నెలకొకసారి నేను పట్నం వస్తూనే వున్నాను. వీలయినప్పుడల్లా నిన్ను కలుస్తూనే వున్నాను. అయినా ఒక నిజం నీతో చెప్పుకోలేకపోయాను!''

అలా మాట్లాడుతూ చటుక్కున తల వంచుకున్నాడు! అర్థం కాలేదు!

''నా జీవనశైలిని మార్చుకుని మా అబ్బాయిని నేను అనుకున్నట్టుగానే చదివించాను. యూనివర్సిటీ గోల్డ్ మెడలిస్ట్‌గా నిలబడ్డాడు.

నా ఆశలకు ప్రతిరూపం నా కొడుకు! నేను కన్నకలల ప్రతిబింబాలు వాడి కళ్ళలో చూసి ఎంతగా సంతోషించానో చెప్పటానికి మాటలు లేవు!''

ఒకవిధంగా చెప్పాలంటే చిన్నప్పుడు పరంధామ్ ఎవరంటే కశ్యపగారి అబ్బాయి! కాని పెరిగి పెద్దవాడయ్యాక కశ్యప ఎవరంటే పరంధామయ్య నాన్నగారు.

ఎంతో ప్రయోజకుడైన కొడుకు! కాదు! అలా తీర్చిదిద్దిన తండ్రి! కశ్యప చెపుతున్న మాటలకు నా మనసులో మెదిలిన నిర్వచనం!

ఎంతో ఆసక్తితో వింటున్నాను! మరో కారణం నా కొడుకు పరిస్థితి కూడా వాడికి చెప్పాలనే తపన నన్ను కుదురుగా కూర్చోపెట్టింది!

''మా అబ్బాయి చదువుకి తగినట్టుగా ఎన్నో ఉద్యోగాలకి మా వాడిని వెతుక్కుంటూ అవకాశాలు వచ్చాయి. అయినా మావాడు తను కోరుకున్న ఉద్యోగంకోసం ఎదురుచూశాడు.

ఒకరోజు వాడు అనుకున్న ఉద్యోగానికి పిలుపువచ్చింది! ఇంటర్వ్యూకి వెళుతున్నవాడిని శుభవార్తతో తిరిగిరమ్మని తండ్రిగా నిండుమనసుతో ఆశీర్వదించాను. ఇంటర్వ్యూలో సెలక్టయ్యాడు. కాని వాడు ఇంటికి రాలేదు! ఇప్పటికీ రాలేదు! ప్రస్తుతం జైలులో ఉన్నాడు''

ఆ మాట వినగానే నా కళ్ళు చీకట్లు కమ్మాయి!

''ఆరోజు...'' కశ్యప మాటలు వినపడగానే నన్ను నేను నిగ్రహించుకున్నాను. అతికష్టంమీద మాటలు కూడదీసుకుంటున్నాడు!

''ఇంటర్వ్యూ అయిపోయింది! మా ఫ్రెండ్ స్కూటరు తిరిగిచ్చేద్దామని వెళుతున్నాను. మధ్యాహ్నం వేళ! దారిలో ఎవరో తెలియని మనిషి లిఫ్ట్ అడిగాడు. కంగారుపడుతున్న అతన్ని స్కూటరు వెనక ఎక్కించుకున్నాను. కొంచెం దూరం వచ్చాక పోలీసు ఇన్‌స్పెక్టర్ స్కూటరుని ఆపాడు. వెంటనే మరో ఇద్దరు పోలీసులు స్కూటరు నెంబరు చూసి 'సార్ మనం పట్టుకోవలసిన స్కూటర్ ఇదే. మనకు ఫోన్‌లో చెప్పిన నంబర్ ఉన్న స్కూటర్!'

పోలీసుల మాట విని ఇన్‌స్పెక్టర్ నన్ను, నా వెనకాల కూర్చున్న మనిషిని చొక్కా పుచ్చుకుని స్కూటర్ దింపాడు. ఎందుకో తెలియని పరిస్థితి!

'ఆడవాళ్ళ మెడలో బంగారు గొలుసు లాగేసుకుని స్కూటర్ మీద పారిపోతారా' అంటూ ఇన్‌స్పెక్టర్ మెడ పట్టుకున్నాడు. 'ఏదిరా గొలుసు' అంటూ పోలీసులు నాతో వచ్చిన మనిషిని కొడుతున్నారు. 'సార్ గొలుసు దొంతనం చేసింది వాడు, నేను కాదు' నాతో వచ్చిన అపరిచిత వ్యక్తి నన్ను చూపించాడు. నేను జాలితో లిఫ్ట్ ఇచ్చింది ఒక దొంగకు. లిఫ్ట్ అడుగుతూ పడిన కంగారు గుర్తుకొచ్చేసరికి విషయం పూర్తిగా అర్థమయింది. 'సార్! ఇతనెవరో నాకు తెలియదు! దారిలో కనపడితే లిఫ్ట్ ఇచ్చాను..' అని నిజం



## తలనొప్పికి 'కూల్' వైద్యం

**త**డిబట్టలు కానీ, ఐస్ కానీ ఎక్కువ సేపు శరీరం మీద వుంచుకుంటే జలుబు చేస్తుందని మన పెద్దవారు అంటుంటారు. కానీ తడిబట్టతోనూ, ఐస్‌తోనూ తలనొప్పి, క్రానిక్ పెయిన్స్ నుంచి విముక్తి లభిస్తుందని ఇటీవల నిర్వహించిన పరిశోధనల్లో రుజువైంది. వీటికి మందులు వాడేకన్నా కూడా తలనొప్పికి తడిబట్ట కట్టుకున్నా లేకపోతే పుదీనా ఆకులను పట్టీలాగా వేసుకున్నా మంచి ఫలితం వుంటుందని వారు అంటున్నారు. అయితే అందరికీ ఈ కూలింగ్ వైద్యం అనుకూలించకపోవచ్చని, దీని మీద విస్తృతంగా పరిశోధనలు నిర్వహించాల్సి వుంటుందని చెపుతున్నారు. ఇవి కనుక విజయవంతం అయితే తలనొప్పికి, క్రానిక్ పెయిన్‌కి మంచి మందు లభించినట్లే....

చెప్పబోతుంటే 'అబద్ధం సార్! కొట్టేసింది వాడే, కావాలంటే వెతకండి' దొంగ చెప్పిన మాటలు వినగానే ఇన్‌స్పెక్టర్ తనిఖీ చేశాడు. నా చొక్కా జేబులోంచి బంగారు గొలుసు తీసిన ఇన్‌స్పెక్టర్ మరింత బలంగా పట్టుకున్నాడు. ఒక దొంగవల్ల పూర్తిగా మోసపోయి పోలీసుల చేతుల్లో ఇరుక్కుపోయాను'' కశ్యప కొడుకు రాసిన ఉత్తరం చదివి ఆశ్చర్యపోయాను.

''మోసపోయిన నా కొడుకు మాట్లాడే పరిస్థితిలో లేనపుడు రాసిన ఉత్తరం'' అంటూ ఉత్తరాన్ని తీసుకుంటున్న కశ్యప ఏడుపుని ఆపుకోలేకపోతున్నాడు.

''మావాడి దగ్గర ఉన్న సర్టిఫికెట్ల వల్ల అడ్రస్ తెలుసుకుని సాయంకాలానికి మా ఇంటికి పోలీసులొచ్చి నన్ను పట్నం తీసుకెళ్ళారు. నా గురించి, నా కొడుకు చదువు గురించి వివరంగా చెప్పాను. ఇంటర్వ్యూకోసం తెచ్చిన సర్టిఫికెట్లు చూశారు. నాతోపాటు వచ్చిన మన ఊరి వాళ్ళు కూడా పోలీసులతో మాట్లాడారు. ప్రయోజనం లేదు. 'గొలుసు దొరికింది మీవాడి జేబులోనే కదా' - పోలీసుల వాదన. నా కొడుకు దొంగ కాడన్న నిజం ఎలా చెప్పాలి, ఏం చెయ్యాలి? నా కొడుకుని మంచిమనిషిగా తీర్చిదిద్దిన తండ్రిని, కాని వాడి మంచి,మర్యాదలు నిరూపించలేని చేతకాని తండ్రిని'' కశ్యప నిస్సహాయ పరిస్థితి!

''పరిస్థితులు చక్కబడలేదు. రోజులు గడిచిపోతున్నాయి. కేసు ఎప్పటికి తెములుతుందో తెలీదు. పోలీసుల బారినుంచి నా కొడుకు ఎప్పుడు బయటపడతాడో కూడా తెలియదు'' కశ్యప మాటల్లో బేలతనం! అతని చూపుల్లో శూన్యం!

కశ్యపని దగ్గరకు తీసుకున్నాను. మెల్లిగా భుజం తట్టాను.

''నాతో పోలీసు స్టేషన్‌కొచ్చిన మన ఊరివాళ్ళు జరిగిన దారుణం తలోరకంగా ఊళ్ళో చెప్పారు. ప్రత్యక్షంగా ఒకలాగా, పరోక్షంగా మరోలాగా! ఊళ్ళోవాళ్ళు ఊళ్ళో ఎవరిష్టం వచ్చినట్టుగా వాళ్ళు మాట్లాడుతున్నారు. ప్రస్తుతం నా జీవితం నా కొడుకు జీవితం వీధిన పడింది.''

ఈమాటలంటూ బావురుమన్నాడు కశ్యప! అచేతనమైపోతుంది మనసు!

మరుక్షణం నాలో ఆందోళన! జరిగింది మామూలు సంఘటన కాదు! అహర్నిశలు శ్రమించి మనసులో ఆలోచనలతో అల్లిన జీవితాన్ని కొడుకుకి అందించిన తండ్రికి జరిగిన ద్రోహం! గుండెలు పగిలి ఏడుస్తున్న కశ్యపని చూశాడు!

ఊహించని దారుణాలను ఎదుర్కొంటున్న ఎంతోమంది కన్నతండ్రులకు ప్రతిరూపంగా కనపడుతున్న కశ్యప! ఒంటరివాడైపోయాడు.

తండ్రిగా వాడు పడుతున్న బాదకు ఓదార్పునివ్వలేనివాళ్ళు, విషయాన్ని కొండంతలు చేసి మాట్లాడి మనసుని తూట్లు పొడుస్తున్నవాళ్ళు! అటువంటివాళ్ళు తోటి మనుషులా?

జవాబు దొరకని ప్రశ్న! నన్ను కుదిపేస్తోంది!

''ఒరేయ్ విశ్వం, మన పిల్లలకి అమూల్యమైన జీవితం అందించగలుగుతున్నాం. కాని వాళ్ళు తమ జీవితాల్ని మనస్ఫూర్తిగా అనుభవించలేకపోతున్నారు. కారణం ఏ క్షణంలో ఎటువంటి ప్రమాదాల్లో ఇరుక్కుపోతారో తెలియదు!

అనుక్షణం భయం! భద్రత లేని జీవితాలు! కశ్యప మాటలకు నాలో స్పందన! హఠాత్తుగా నా కొడుకు కళ్ళ ముందు కదిలాడు! కశ్యప కొడుకు ప్రస్తుత పరిస్థితి నా మనసు మీద ప్రభావం చూపిస్తోంది. ఊహించటానికే భయంగా ఉంది. మనిషి మరో మనిషితో కలిసి బ్రతికే సహజీవనం! కాని ఈరోజు, మనమూ, మన పిల్లలు గడుపుతున్నది అసహన జీవనం!

కశ్యప మాటల్లో దైనందిన జీవితపు విశ్లేషణ! ఒప్పుకుని తీరాలి!

నిత్య జీవితాన్ని అస్తవ్యస్తం చేసే దురాగతాల మధ్య చితికిపోతున్న ఈతరం బ్రతుకులు!

కశ్యపని రెప్పవాల్చకుండా చూస్తున్నాను! ప్రస్తుత సామాజిక నైజపు ప్రతిబింబాలు కశ్యప కళ్ళల్లో స్పష్టమవుతున్నాయి.


విద్యని. జ్ఞానాన్ని ఎవ్వరూ దొంగిలించలేరు. మరిప్పుడు? పరిస్థితుల గుప్పిట్లో విద్య బంధించబడింది! జ్ఞానం కటకటాల చీకట్లో కొట్టుమిట్టాడుతోంది!

కశ్యప కొడుకు గుర్తుకొచ్చాడు! అసలు మాకు భవిష్యత్తుందా? అని ప్రశ్నిస్తున్నాడు. ఇదే ప్రశ్నతో మరెందరో కుర్రాళ్లు! విచలితమైపోతూ కశ్యపని చూస్తున్నాను!

''మనుషుల వైఖరి మారాలి! మార్చి తీరాలి! ఎలా? నాన్నలందరూ ఏకంకావాలి! తప్పనిసరిగా ఏకం కావాలి!'' గట్టిగా అరుస్తున్నాడు. నేనూ అరుస్తూనే ఉన్నాను.

మా గొంతులతో మరెన్నో గొంతులు కలుస్తాయా?

★



# నవలావణ్యాం

మామూలుగా ముప్పై మూడేళ్లు దాటితే బాలీవుడ్‌లో చాలామంది అమ్మపాత్రల్లో నటిస్తుంటారు. లేదంటే పెళ్లి చేసుకుని పిల్లల్ని కని ఏ అమెరికాలోనో సెటిలైపోతారు. కానీ ఐశ్వర్య అందగత్తెగా ఒక ఊపు వూపుతోంది. ముప్పై నాలుగులోకొచ్చిన ఐశ్వర్య ఇప్పుడు మరింత లావణ్యంగా వుందని అంటున్నారు. గురు, ఉమ్రావ్‌జాన్, ధూమ్-2 మూడు సినిమాలు విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. కాల్షీట్ల కోసం అర్రులు చాసే నిర్మాతలున్నారు. వయసు పెరిగితే అందం తగ్గుతుందో పెరుగుతుందో ఐశ్వర్య విషయంలో పెద్ద డౌటు. ఈ నవలావణ్యా లలనామణి హాలీవుడ్ సినిమాల్లోనూ నటిస్తోంది. ఈవిడ అందానికి హద్దులే లేనట్టున్నాయి!